# వంట

బతుకుజీవుడా అనుకున్నాను .

అసలేంజరిగిందంటే -

నిన్న సాయంత్రం వంట వంతు నాది. కానీ డ్యూటీ నుంచి రావడం ఆలస్యమైంది మామూలుగానయితే ఐదున్నరకల్లా వచ్చేస్తాను నిన్న ఏడు దాటింది. పద్మిని ఐదున్నరకే ఇంటికి వచ్చేసింది తానే కాఫీ పెట్టుకొని తాగి అలాగే మంచంమీద వరగి పోయింది. దీపం కూడా వేయలేదు ఇల్లంతా చీకటిగా వుంది వీధివరండా తలుపు దగ్గరకు వేసి వుంది. గడియపెట్టలేదు.

" నువ్వు ముందుగా వచ్చావుకదా ! కాస్త వంటపని ప్రారంభించలేక పోయావా" కాస్త చిరాకుగాను, కోపంగాను అని వుంటాను. వాతావరణం భగ్గుమంది.

" కాస్త అలసటగా వుందని పడుకున్నాను పైగా ఈపూట వంటచేయవలసింది నువ్వుకదా" అని సర్రుమంది.

" నిజమేలే, ముందొచ్చావుకదా - అలా వూరికేనే పడుకోకపోతే బియ్యంకడిగి, కుక్కరులో పెట్టొచ్చుకదా" అని అన్నాను. అనకుండా వూరుకొని వుండవలసింది. తానే ఏవో నాలుగు మాటలాడి వూరుకొని వుండును.

సెగలు, పొగలు ప్రారంభమయ్యాయి. నేను బట్టలు మార్చుకొని, బాత్రూంలోకి వెళ్లి కాళ్లూ చేతులూ ముఖం కడుక్కొని ఇంతకాఫీ పెట్టుకొని తాగి నా మానాన నేను పని ప్రారంభించాను.

అవతలి గదిలోంచి మంటలు, మెరుపులూను. నేను ఉత్తరాంధ్రా కెమికల్స్ లో కెమిస్టుగా పని చేస్తున్నాను. నిన్న నాది జనరల్ షిఫ్ట్ కనుక పని ఐదు గంటలకే ఐపోవాలి. కాని కొంచెం పని ఉండి ఆలస్యమైంది. పద్మిని విశాఖ ఇండస్ట్రీస్ మేనేజ్‌మెంట్ సెక్షన్‌లో టైపిస్ట్‌గా పని చేస్తుంది. నెలలో పది హేను రోజులు నేను వండాలి. పదిహేను రోజులు ఆమె వండాలి. ఇందుకు పెళ్ళికి ముందే ఇద్దరం ఒప్పుకొన్నాం ఎవరి బట్టలు వారే ఉతుక్కోవాలి అనారోగ్యం, తీరుబడిలేనంత పని మొదలేన సందర్భాల్లో మాత్రం ఒకరికొకరం సాయం చేసుకోవాలి. ఇంటి ఖర్చు కూడా చెరి సగం. ఎవరి సేవింగ్స్ వాళ్ళవే. ఇంత వరకూ అటువంటి సమస్య రాలేదు గానీ, ఒకముందు, పిల్లలపెంపకంలో కూడా పనినుంచి ఖర్చువరకూ, ఇద్దరిదీ సమాన బాధ్యత. సుమారు రెండేళ్ళగా ఇలా బాగానే నడుస్తున్నది. కొద్దికాలం క్రితం నుంచి ఇటువంటి చిన్న చిన్న గొడవలు ప్రారంభమయ్యాయి వంటచేయడం కూడా ఒక సాంకేతిక నైపుణ్యంమేనని నన్ను గుర్తించమంటుంది పద్మిని. ఏమైనా ఇద్దరం సమానంగా చేసుకోవాలన్నంత వరకూ ఒప్పుకుటాను. నేను మాలేబ్‌లో పని చేయడం, లేదా కంప్యూటర్స్‌లో పని చెయ్యడం ఎంత నైపుణ్యంతో కూడిన పనో, ఆఫ్టరాల్ వండడం కూడా అంత నైపుణ్యంతో కూడిన పనేనని ఎలా ఒప్పుకోను ?

ఒకసారి ఇంట్లో కూరలులేవు. నాలుగో, ఐదో వడిలిపోయిన వంకాయిలున్నాయి. వాటితో పద్మిని అద్భుతంగా కూర తయారు చేసింది. నేను ఆ పూట ఏ ఆవకాయతోనో, ఆమ్లెట్ తోనో సరి పెట్టు కొందామనుకున్నాను. ఒక వారం రోజులు క్రితం గోంగూర పచ్చడి చేశాను. మొన్నాటికే బూజు పట్టింది.

పద్మిని దెబ్బలాడింది. మార్కెట్టుకువెళ్లి చాలా మంచి గోంగూర తానే తెచ్చింది. అలాంటి గోంగూర పచ్చడి చేసి చారు చేశాను గోంగూర పచ్చడి చేయడమంటే లేబ్‌లో టైట్రేషన్ చేయడం కాదంది. ఆయిల్స్‌లో ఏసిడ్ పర్సెంట్ కట్టడం రాగానే సరికాదంది. వంటచేయడం మాత్రమే కాక ఆ వంటకు అవసరమైన బియ్యం కూరలూ ఎంచుకోవడానికి కూడా చాలా అనుభవం కావాలంది.

నాకు వళ్ళుమండి పోయింది. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఫస్ట్‌క్లాసులో పాసై ఐదేళ్లు కెమిస్టుగా పని చేస్తున్నాను. నన్ను అంత మాటంటే కోపంరాదూ ?

వంటలో కూడా బోలెడు టెక్నికల్ నాలెడ్జ్ వుందంటుంది పద్మిని. కొద్ది సంవత్సరాల ట్రైనింగ్ లేక చదువు తరతరాలుగా జీవితాలకు జీవితాలు ఒకే పని చేస్తూ పొందిన అనుభవం రెండూ ఒకటెలావుతాయి? అంటుంది. నాకు ప్రగతి శీల భావాలు లేకపోలేదు. మార్క్స్ రచనలు చదవకపోయినా మార్క్సిస్టులతో దగ్గిర పరిచయం ఉంది కనుకనే ఆదర్శవివాహం చేసుకొన్నాను. స్త్రీలను తక్కువగా చూడకూడదని నేను ఒప్పుకుంటాను. విద్యలో ఉద్యోగాల్లో సమాన అవకాశాలు ఇవ్వాలని ఒప్పుకొంటాను. మాపెళ్ళి ఇద్దరికీ సన్ని హితులైన కొందరు మిత్రులు బంధువులూ హాజరైన ఒక చిన్న సమావేశంలో జరిగింది. మాది కనీసం " మీటింగ్ పెళ్ళి " కూడా కాదు. ఇది బహిరంగ సత్యం.

వంటగురించి పద్మిని చెప్పినవి సమంజసమైనవని నాకు అనిపించింది.

టమాటా పప్పు వండాను చారు కాచాను. బూడిద గుమ్మిడికాయ వడియాలు వేయించాను. పద్మిని అనవసరంగా తగువుకు దిగి నాకు కోపం తెప్పించింది కాని, లేకపోతే ఇద్దరికీ ఆమ్లెట్లు కూడా వేద్దామనుకొన్నాను. నావంట నాకే నచ్చేసింది. మెచ్చుకోదు. పైగా తగువు. తనకోసం కష్టపడి ఆమ్లెట్లువెయ్యడం (తినడం) కూడా నేర్చుకొన్నాను.

" దోపిడీ చేసేముందు చులకన చేసి అవమానించడం మగవాళ్ళ వర్గస్వభావం. ఆడదాన్లా ఇంట్లోకూర్చుని వండడమే కదా అంటారు. అది మీ మగవాళ్లు అనుకునేటంత సులభం కాదు. ఏబియ్యా ముద్ద అవుతుందో ఏబియ్యం పలుకు అవుతుందో తెలియాలి కాయగూరలు పుచ్చులేకుండా తెలివిగా ఎంచుకోవాలి. ఏకూర ఎలా వండితే బాగుంటుందో ఎన్నిరకాలుగా వండవచ్చో తెలియాలి. ఏదీ పారెయ్యకూడదు. బీరకాయలు చెక్కుపచ్చడి చేయచ్చు. అరటికాయల చెక్కు పులుసు చేయొచ్చు. ఏదైనా మిగిలి పోతే పాడైపోకుండా సద్వినియోగం చేయాలి. పప్పు మిగిలిపోతే పప్పుచారు చేయాలి. అన్నంమిగిలిపోతే మర్నాడు పులిహార చేసి టిఫిన్ సరి పెట్టాలి. రకరకాల పిండి వంటల్నించి టిఫిన్ చెయ్యడం, నిలవపచ్చళ్ళు పెట్టడం కూడా రావాలి. ఇవన్నీ సకాలంలో చేసి పెట్టగలగాలి. దీనికి ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అనుభవం కావాలి.." ఇంక ఇలా ఏవేవో చాలా చాలా సంగతులు మాట్లాడింది. వాదనలో ఆమెతో ఓడిపోతానేమోనని భయం వేసింది.

" దోపిడి చేసేముందు, చులకన చేసి నీచంగా చూసి అవమానించడం దోపిడిదారుల వర్గస్వభావం. ఎంత చేసినా మగవాళ్లు ఆ స్వభావం నుంచి బయట పడలేరు ..." అని మళ్లీ మొదటికొచ్చింది.

" ఎన్నెన్ని పనులూ సేవలూ చేయించుకున్నా, సమయం వస్తే ఆడవాళ్లగురించి పరమ నీచంగా మాట్లాడతారు మగవాళ్లు. వంటలు చేసే మగవాళ్లు పూర్వకాలం నుంచి వున్నారు. వాళ్లంతా ఆడపని చేస్తున్నాం అనే భావంతోనే చేశారు. మగవాళ్లు ఎంతో ఇష్టంగా వంటచేసినా మనసులోంచి ఇది ఆడపని అనేభావం చస్తేపోదు ...." అంటూ ఇలా ఎన్నెన్నో చెరగడం మొదలు పెట్టింది. వాదనలోకి దిగితే లాభం లేదని వంటముగించి డాబా మీదకి జారుకున్నాను.

ఈరోజు తెల్లవారి లేచి మౌనంగా మొహం కడుక్కోడానికి బాత్రూంలోకి వెళుతుంటే " వాదనలో ఓడిపోతానని భయం వేసి - డాబా మీదికి పారి పోయావా" ? అని నవ్వుతూనే దెప్పింది, ఈ 'ఆడవాళ్లకు నిజాలు ఎలా తెలిసి పోతాయో తెలీదు.

" అబ్బే! అదేంలేదు. వంట చేయడానికి కూడా ఎంతో తెలివీ, అనుభవం ఓర్పు ఉండాలని ఒప్పుకుంటా" నన్నాను చాలా మామూలుగా. టెక్నికల్ నాలెడ్జ్, ట్రైనింగ్ అనే మాటలు వాడకుండా చాలా తెలివిగా మాట్లాడాను.

"ఈ సారి ఆమాత్రం ఒప్పుకున్నావుకదా. సంతోషం. ఈ సారి టెక్నికల్ నాలెడ్జ్ , ట్రైనింగ్ గురించి కూడా ఒప్పిస్తాను. కాదు .. ప్రాక్టికల్ గా నీ చేత చేయించి, నీవు ఒప్పుకొనేలా చేస్తాను" అంది పద్మిని.

చెమటతో తడిసిన మొహాన్ని తుడుచుకోడానికి తువ్వాలు తీశాను.

*రచన : 5-1-1996.*

*ప్రచురణ : వార్త , 4-10-1996.*